
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....

# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 264 ఎడిటర్: కె.యువరాజ్ శనివారం 4-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-

వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు

## రైతు భరోసా నిధుల విడుదలలో
# రేవంత్ సర్కార్ రికార్డు



**హైదరాబాద్, జులై 3 (వన్‌నేషన్):** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని శుభాకాంక్షలు..

'ఐదు సంకల్పాలు' స్వీకరించాలని పిలుపు



**న్యూఢిల్లీ, జులై 3 (వన్‌నేషన్):** జమ్మూ- కశ్మీర్‌లో నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభమైన వార్షిక అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తిశ్రద్ధలతో, క్రమ శిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు.

శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ (X) వేదికగా పంచుకుంటూ పీఎం మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. 'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం 'బాబా బర్ఫానీ' (మంచు లింగం)ని నేరుగా

2లో




- జిందాల్ రాకతో మనదిక ఉక్కు రాష్ట్రం: సీఎం - కడప జిల్లా జమ్మలమడుగులో జిందాల్ స్టీల్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన - విజయనగరంలోని జిందాల్ ఇండస్ట్రియల్ పార్కుకు వర్చువల్‌గా భూమిపూజ

**కడప, జులై 3 (వన్‌నేషన్):** రాయలసీమకు నవశకం మొదలైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జిందాల్ స్టీల్ ప్లాంట్ రాకతో ఏపీ ఉక్కు రాష్ట్రంగా అవతరించనున్నదని తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో శుక్రవారం స్టీల్‌ప్లాంట్ నిర్మాణ పనులను కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జేఎసడబ్ల్యూ సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో తలపెట్టిన జిందాల్ ఇండస్ట్రియల్ పార్కు కోసం వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... రాయలసీమ చరిత్రలోనే ఇది ఒక మైలురాయి అని, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అందరి కల ఈరోజు నిజమైందని అన్నారు. ఇక్కడ లభించే ఖనిజ సంపదను ఇక్కడే సంపద సృష్టికి వినియోగిస్తామని ప్రకటించారు. "జిందాల్ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టింది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను మీ రెండో నివాసం చేసుకుని పెట్టుబడులు పెట్టాలని సజజన్ జిందాల్‌ను అడిగాను. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు

3లో

## శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో
# ఘనంగా సంకటహర చతుర్థి



**మన్సురాబాద్, జులై 3 (వన్‌నేషన్):** మన్సురాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్ కాలనీ ఫేస్ 1 లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఎంతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల ఈ విధంగానే సంకటహర చతుర్థి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం నుండి వినాయకుడికి పంచామృత అభిషేకం, గణపతి అష్టోత్తరం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించామని అన్నారు. ఆ తర్వాత అన్న ప్రసాద వితరణ ఎంతో ఘనంగా నిర్వహించినట్లు తెలియజేశారు. పూజా కార్యక్రమం, అన్న ప్రసాద దాతలు పెద్ది కుప్ప కృష్ణ చైతన్య గాయత్రి, మెరుగుమల్ల నరేష్ సబితా, పందిరి వెంకన్న, శ్రీ బాలాజీ కిరాణా అండ్ డ్రైఫ్రూట్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న కాలనీవాసులు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయకం కమిటీ చైర్మన్ బాలగోని అంజయ్య గౌడ్, ట్రెజరర్ రంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి బూరెల భాస్కర్, ఉపాధ్యక్షులు కుమార స్వామి, సిలువేరు గాలయ్య, ఇంకా తదితర కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అసభ్య పోస్టులపై
# కఠిన చర్యలు

- సైబర్ క్రైమ్ ఐజీతో డిప్యూటీ సీఎం పవన్ - ఈగల్ వార్షిక నివేదిక అందించిన ఐజీ ఆకే



**అమరావతి, జులై 3 (వన్‌నేషన్):** సోషల్ మీడియాలో వ్యక్తులను కించపరుస్తూ పెడుతున్న అసభ్య పోస్టులపై మరింత కఠినంగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. సోషల్ మీడియా వేధింపుల నేపథ్యంలో సైబర్ చట్టాలను మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఆయనకు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ విభాగం తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వ్యక్తులను కించపరుస్తూ పెడుతున్న పోస్టులు, సైబర్ వేధింపులు వంటి అంశాలపై పవన్ కల్యాణ్ ఆయనతో చర్చించారు. అసభ్య పోస్టులపై మరింత కఠినంగా వ్యవహరించాలని, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని

అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

## - సదాశివపేట మండలం పాట్ పల్లి గ్రామం - టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సదాశివపేట, జులై 3 (వన్‌నేషన్):** సదాశివపేట మండలం పాట్ పల్లి గ్రామం లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డప్పు చప్పుళ్ళతో నిర్మలా జగ్గారెడ్డి కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తో పేదల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల నెరవేరుతుండటం సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామగ్రామాన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణం శరవేగంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ బిల్లుల మంజూరు లో ఎక్కడా జాప్యం లేకుండా నిర్మాణానికి అనుకూలంగా నిధులు విడుదల అవుతున్నాయన్నారు. ఇప్పటికే వందల సంఖ్య లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగాయని, ఇందిరమ్మ ఇంటికి ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు వెంటనే చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాట్ పల్లి గ్రామ సర్పంచ్ గొల్ల రాములమ్మ లక్ష్మమ్మయ్య, కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న, మండల ప్రెసిడెంట్ ఒగ్గు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# హత్యకాపడ్డ క్షవర వృత్తి దారుడు మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**హైదరాబాద్, జులై 3 (వన్‌నేషన్):** ఒంగోలు నగరంలో పట్టపగలు అతి దారుణంగా హత్యకు గురైన గరిటపల్లి మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయి బ్రాహ్మణ సంఘాలు పెద్ద ఎత్తున నగరంలో ఆందోళనకు దిగారు. ఒంగోలు స్థానిక కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ బీసీ కుల సంఘాలు ప్రజాసంఘాలు సంఘీభావంలో పాల్గొని మద్దతు ఇచ్చాయి. వక్తలు మాట్లాడుతూ మహేంద్ర బాధ్యత కుటుంబానికి రెండు ఎకరాల పొలం కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి నివాస గృహాన్ని ఏర్పాటు చేయాలని 20 లక్షల రూపాయలు ఎక్స్ కెసిఆర్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయి బ్రాహ్మణ క్షవర విద్యుదారుల పై దాడులు హత్యలు అధికమవుతున్న దృష్ట్యా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ లాంటి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని వక్తలు కోరారు. నిరసన అనంతరం నాయి బ్రాహ్మణ జేఏసీ ప్రతినిధి బృందం ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజుని కలిసి మెమొరాడం అందించి బాధ్యత కుటుంబానికి ఆదుకోవాలని కోరగా ఎస్పీ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లిన్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఉమ్మడిగా గరిటపల్లి మహేంద్ర వ్యతిరేక న్యాయ పోరాట కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ క్షవరశాల సంఘం అధ్యక్షులు కొంజేటి రామకృష్ణ నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరు గురుస్వామి నాయీబ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షులు వేల్పూరి అబ్రహం బాబు నాయి బ్రాహ్మణ నందా యువజన సేన రాష్ట్ర కార్యదర్శి విప్పగుంట రామాంజనేయులు భారతీయ నాయీబ్రాహ్మణ జాతీయ కన్వీనర్ మద్దులూరి శ్రీనివాసులు నాయి బ్రాహ్మణ జేఏసీ మార్కాపురం జిల్లా కన్వీనర్ కల్వకురి వెంకటేశ్వర్లు ద్రోణాదుల వెంకట్రావు అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం



**యాదాద్రి భువనగిరి జిల్లా: జులై 03,(వన్ నేషన్) :** కామినేని దంత వైద్యశాల, నార్కట్ పల్లి వారి సహకారంతో మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన కామినేని దంత వైద్యశాల వైద్యులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో దంత వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్సలు అందించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు శిబిరానికి హాజరై దంత పరీక్షలు చేయించుకుని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో కామినేని దంత వైద్యశాల పిఆర్ఓ చంద్రశేఖర్,డా. శృతి,డా. రామాసాయి చరణ్,డా. మణికంఠ,డా. హసీత రాజ్,డా. దూబే దీప్తి, డా. అమూల్య రెడ్డి,భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు తాళ్లపల్లి జితేందర్,గంటెపాక శివ కుమార్, బూడిద బిక్షం, ఉంద్రాతి నర్సింహా,జంపాల ఉమాపతి, హేమలత, సంధ్య, ఉమ,గ్రామ ప్రముఖులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# 79 వ సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ 2026 పోటీలకు తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టు

## - యూనిఫామ్ టీమ్ కిట్ ని అందించిన 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ - జులై 7 నుంచి 12 వరకు చెన్నై కట్ట న్ కుళత్తూర్ డాక్టర్ టి. పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్ లో పోటీలు



**హైదరాబాద్, జులై 3 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర సీనియర్ వాటర్ పోలో జట్టు సీనియర్ నేషనల్స్ పోటీలకు సిద్ధమైంది. తెలంగాణ వాటర్ పోలో టీం 2026 జులై 7 నుంచి జులై 12 వరకు చెన్నై కట్ట న్ కుళత్తూర్ డాక్టర్ టి. పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్ లో నిర్వహించనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్ లకు శుక్రవారం గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో యూనిఫామ్, టీషీర్ట్స్ కిట్ అందించారు. ఈ ఈవెంట్ కిట్ ని 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ స్పాన్సర్ చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ నేషనల్స్ వాటర్ పోలో టీమ్ , స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి . చంద్ర శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి జి . ఉమేష్ , 7సీస్ ఎంటర్టైన్మెంట్ లిమిటెడ్ ఎండీ ఎల్. ఎం శంకర్ , టీం మేనేజర్ టి కిరణ్ కుమార్ , ఐ బాల మల్లేశ్వర్, వాటర్ పోలో కోచ్ తిరుపతి , ఆయుష్ యాదవ్, బాలాజీ పాల్గొన్నారు. సీనియర్ నేషనల్స్ వాటర్ పోలో జట్టు ఎంపిక ట్రయల్స్ అంబర్‌పేట్ లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన 11వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ లో నిర్వహించారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ: మేడి నరేష్



**నకిరేకల్, జులై 3 (వన్‌నేషన్):** తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత గారు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. కాబట్టి ఈ తరుణంలో నకిరేకల్ నియోజకవర్గ హెడ్ క్వార్టర్లో ఇన్చార్జ్ అయినటువంటి మేడి నరేష్ ఆధ్వర్యంలో తదుపరి పార్టీ యొక్క జెండాను నకిరేకల్ నియోజకవర్గం ఇన్చార్జి మేడి నరేష్ ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్ మేడి నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవితక్క ఆశయం రాష్ట్రంలో ఉచిత విద్య ,ఉచిత వైద్యం, రైతుల సంక్షేమం, నిరుద్యోగ యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు, సామాజిక న్యాయం చేయటమే ఆమె లక్ష్యమని మాట్లాడారు. ఇవన్నీ పాంచ జన్యం అనే పథకం రూపొందించామని తెలిపారు. రానున్న రోజుల్లో అధికారంలోకి కచ్చితంగా వస్తామని విశ్వసించారు. అతి తొందరలో నకిరేకల్ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ నకిరేకల్ నియోజకవర్గం ఇంచార్జ్ మేడి నరేష్ మాట్లాడుతూ ఈరోజు మేము నకిరేకల్ నియోజకవర్గం లో తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి మొదటి అడుగు వేయడం జరిగింది ఇకనుంచి నకిరేకల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కొరకు ప్రతి ఇంటికి మేము వెళ్తామని నియోజకవర్గంలో ఉన్నటువంటి సమస్యలను అన్నింటిని ఎండగడతామని, రాష్ట్రంలో ఒక రాక్షస పాలన జరుగుతున్నదని ఇచ్చిన హామీలన్నీ విఫలమయ్యాయని మాట్లాడారు, కచ్చితంగా రాష్ట్ర ఆదాయం 1,80,000 కోట్లు వీటన్నింటిలో సగం ఖర్చు చేసిన ఉచితంగా విద్యను వైద్యాన్ని అందించొచ్చు. అయినా కూడా ఇంకా 80000 కోట్ల రూపాయలు మిగులు బడ్జెట్ ఉంటుంది. అడ్డగోలుగా స్కీముల పేరుతోటి స్కాముల్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, మరి ఎమ్మెల్యే వేముల వీరేశం ఏం చేస్తుండో ఆయనకే తెలియదు. నిజంగా కాంగ్రెస్ పార్టీకి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రైతుల మీద ఏమాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్న నియోజకవర్గ రైతుల ధాన్యాన్ని ఒక్క గింజ లేకుండా కొని రైతుల పక్షపాతిగా నిలిచే దమ్ము నీకుందా అని చెప్పేసి నిలదీయడం జరిగింది. వేముల వీరేశంని రైతుల యొక్క గింజ ధాన్యం లేకుండా కొన్నప్పుడు మాత్రమే నకిరేకల్ లో అడుగుపెట్టనివ్వాలి అని చెప్పి మాట్లాడడం జరిగింది. ఏదేమైనా రేపు జరగనున్న ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గంలో మొట్టమొదటి జెండా మా టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురుతుందని మేము నమ్ముతున్నామని మాట్లాడడం జరిగింది. ఈరోజు కార్యక్రమం నిజంగా మాది తొలి అడుగు చాలా సంతోషంగా ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది, రేపు జరగబోయే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి మేమే కైవసం చేసుకుంటామని తెలియజేస్తున్నాం. నకిరేకల్ నియోజకవర్గం లో గ్రామ గ్రామాన ఉన్న సమస్యలన్నీ పరిష్కారం కోసం పోరాడేందుకు టిఆర్ఎస్ పార్టీ నాయకులు అందుబాటులో ఎల్లప్పుడూ ఉంటారని తెలుపుతున్నాం. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కార్యకర్తలకు అభిమానులకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్క గారి తరపున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ తెలంగాణ మాధవక్క, నియోజకవర్గ నాయకులు చిరుమర్తి ఉపేందర్, నాయకులు చిరుమర్తి ప్రవీణ్, ప్రేమ్ ,జిల్లా గిరి, అల్లి అనిల్,అల్లి గణేష్,అభిలాష్,శివ కుమార్, చక్ర వర్తి, సాయి, కృష్ణ, సునీత అనిత కల్పన సుశీల నాగార్జున వెంకట్, గోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# అమర్‌నాథ్ యాత్రికులకు ప్రధాని శుభాకాంక్షలు..

(1వ పేజీ తరువాయి)

లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర

# పరవశింపజేసిన 'పంచతంత్ర నృత్య కథలు'



**హైదరాబాద్, జులై 3 (వన్‌నేషన్):** శతాబ్దాల నాటి కథల జ్ఞానం నృత్యమై కదలివచ్చింది. అభినయమే భాషగా, హాస్య చమత్కారాలే హంగులుగా సాగిన ఈ 'పంచతంత్ర నృత్య కథలు' నృత్య రూపకానికి రవీంద్రభారతి వేదికైంది. ఈ నృత్య రూపకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందిన ఇరవై మంది కళాకారులు ఈ ప్రదర్శనను రక్తికట్టించారు. భరతనాట్య నృత్య రీతులు, హావభావాలతో కూడిన ఈ ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. హాస్యం, భావోద్వేగం, చమత్కారం, అద్భుతమైన విజువల్స్‌తో కథా సంప్రదాయాల గొప్పదనాన్ని చాటి చెప్పడమే కాకుండా, అందరిని అలరించింది. ప్రముఖ నృత్యకారిణి, పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ అద్భుతమైన కొరియోగ్రఫీ, దర్శకత్వంలో శంకరానంద కళాక్షేత్ర సమర్పించిన ఈ సరికొత్త నృత్య నాటక ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖకు చెందిన 'అసిస్టెన్స్ టు కల్చరల్ ఆర్గనైజేషన్స్ విత్ నేషనల్ ప్రెజెన్స్' పథకం కింద ఈ కార్యక్రమానికి మద్దతు లభించింది. 78 నిమిషాల పాటు సాగిన ఈ వినూత్న ప్రదర్శనలో పంచతంత్రం నుంచి ఐదు ప్రసిద్ధ కథలను ప్రదర్శించారు. 'పంచతంత్ర నృత్య కథలు' పంచతంత్రంలోని ప్రసిద్ధ కథలకు నృత్య రూపంలో ప్రాణం పోసే ఒక అద్భుతమైన ప్రదర్శన ఇది. ఉపమానాలు, రూపకాల ద్వారా ఈ నృత్య నాటకం స్నేహం, శౌర్యం, సమయస్ఫూర్తి, మూర్ఖత్వం, నాయకత్వ లక్షణాలు, స్వేచ్ఛ వంటి విలువలు వివరించింది. హాస్యం, చమత్కారాలతో కూడిన ఈ నృత్య, నాటక ప్రదర్శనలో పంచతంత్రం నుంచి ఐదు ప్రసిద్ధ కథలు మన కళ్ళకు కట్టినట్లు చూపించారు. అడవికి రాజైన బలమైన సింహాన్ని తన తెలివితో ఓడించిన తెలివైన కుందేలు కథ, చెక్క దుంగ మధ్యలో ఉన్న మేకును లాగి తోకను ఇరికించుకున్న మూర్ఖపు కోతి కథ, కొంగలు తాబేలు కథ, దుష్ట మొసలి తెలివైన కోతి కథ, కిరాతకుడి వల నుంచి పావురాలు తప్పించుకునే కథలు అద్భుతంగా ఆవిష్కరించారు. ఎలాంటి సాహిత్యం లేని ఈ ప్రదర్శనకు ప్రముఖ సంగీత విద్వాంసులు, స్వరకర్త ప్రేమ రామమూర్తి సంగీతం అందించారు. ఈ నాటకానికి జయంతి ద్వారకానాథ్ ఆంగ్లంలో వ్యాఖ్యానం అందించగా, కాస్ట్యూమ్స్ గణేష్ నల్లారి, దీపా కృష్ణమాచారి, డిజిటల్ డిజైన్ గుంజన్ అష్టపుత్రే, లైటింగ్ సూర్యారావు అందించారు. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259



## ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత కె. భాగ్యరాజ్ కుటుంబానికి
# కేజీఎఫ్ ప్రతినిధుల ప్రగాఢ సంతాపం



**చెన్నై, జులై 3 (వన్ నేషన్):** ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత కె. భాగ్యరాజ్ మరణవార్త సినీ పరిశ్రమతో పాటు తెలుగు, తమిళ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భాగ్యరాజ్ నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించి లక్షలాది మంది అభిమానుల ప్రేమాభిమానాలను సంపాదించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీపెరంబుదూరులో నిర్వహించిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (KGF) మహానాడుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, కమ్మ సమాజం, తెలుగు ప్రజలు, తెలుగు సంస్కృతి గురించి ఎంతో ఆప్యాయంగా, ప్రేరణాత్మకంగా మాట్లాడి అందరి హృదయాలను గెలుచుకున్నారు.

ఆయన మరణవార్త తెలుసుకున్న కేజీఎఫ్ చైర్మన్ జట్టి కుసుమ కుమార్ ఆదేశాల మేరకు కేజీఎఫ్ ప్రతినిధుల బృందం చెన్నైలోని భాగ్యరాజ్ నివాసానికి వెళ్లి, ఆయన సతీమణి పూర్ణిమ ని, కుమారుడు శాంతను ని కలిసి కేజీఎఫ్ తరఫున, కమ్మ సమాజం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నర్రా రాఘవేంద్రరావు, మందలపు సాయిబాబు చౌదరి, వేలూరు శ్రీనివాస్, రూపనేని శ్రీనివాస్, మోటేపల్లి ప్రకాష్తో పాటు కేజీఎఫ్ సభ్యులు, కమ్మ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. భాగ్యరాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని కేజీఎఫ్ సభ్యులు ప్రార్థించారు.

## తెలంగాణ కాంగ్రెస్ SC డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ గా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ నియామకం

**జవహార్ నగర్, జులై 3 (వన్‌నేషన్):** తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ ముద్దు బిడ్డ తెలంగాణాలో జరిగిన, జరుగుతున్న వివిధ సామాజిక ధళిత,బహుజన ఉద్యమాలకు నాయకత్వం వహించిన డాక్టర్ గడ్డం శ్రీనివాస్ ప్రస్తుతం ప్రాజజ కన్వీనర్ గా ఎస్సీ విభాగం బాద్యతలూ నిర్వహిస్తున్నాడు తనూ ప్రజా సమస్యలపై నిరంతరం నీతి, నిజాయితి మరియు పట్టుదలతో పార్టీ పట్లా అంకితా బావంతో చెస్తున్నా కార్యక్రమాలకూ గుర్తింపుగా తానను రాష్ట్ర స్థాయిలో పార్టీని ఇంకా భలోపేతం చేయాలని వైస్ చైర్మన్ గా ఏఐసిసి అధ్యక్షుడు శ్రీ మల్లిఖార్జున్ ఖర్గే , ఏఐసిసి ఎస్ సి డిపార్ట్‌మెంట్ జాతీయ చైర్మన్ మరియు ఢిల్లీ ప్రభుత్వ మాజీ మంత్రి శ్రీ రాజేంద్రపాల్ గౌతమ్ మరియు TPCC SC డిపార్ట్‌మెంట్ చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నిన్న గాంధీ బవనంలో ప్రెస్ మీట్ పెట్టి నియమించడం జరిగింది. ఈ సంధర్బంగా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ భాద్యతలు అప్పచెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ , చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఢిల్లీ AICC పెద్దలందరికి పెరుపెరునా హృదయపూర్వక ధన్యవాలు తెలిపారు.

# డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సైబరాబాద్ పోలీసు అధికారులు

## - డ్రగ్స్ నిర్మూలనలో సైబరాబాద్ పోలీసుల పనితీరుకు డీజీపీ ప్రశంసలు



**సైబరాబాద్, జులై 3 (వన్ నేషన్):** రాష్ట్రంలోని అన్ని యూనిట్ల అధికారులు, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శాంతిభద్రతలు, నేర నియంత్రణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజలకు చేరువైన పోలీసింగ్‌పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రమేష్ రెడ్డి సైబరాబాద్




కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా జజుబీా, ఈ-సాక్ష్య (e-Sakshya) వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను పూర్తి స్థాయిలో అమలు చేసి, ప్రతి కేసులో డిజిటల్ ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ కమిషనరేట్ పరిధిలో అమలు చేస్తున్న ప్రత్యేక చర్యలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్లు, నేర నియంత్రణ చర్యలు, విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలపై వివరించారు. డ్రగ్స్ నిర్మూలనలో సైబరాబాద్ పోలీసులు సాధిస్తున్న ఫలితాలను డీజీపీ అభినందించారు. ఈ సమావేశంలో కమిషనర్‌తో పాటు కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు..

# సాంక్షన్ ప్లాన్ ప్రకారమే నిర్మాణమా?

## జిహెచ్ఎంసి తనిఖీలకు స్థానికులు డిమాండ్



**శేరిలింగంపల్లి ప్రతినిధి, జులై 3 (వన్ నేషన్):** హైటెక్ సిటీ ప్రధాన రహదారిలోని ఎం.బి. సొసైటీ పరిసరాల్లో, ఖానమ్మెట్ ప్రాంతంలో కొనసాగుతున్న ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు, ఆమోదిత భవన ప్రణాళిక (సాంక్షన్ ప్లాన్) ప్రకారమే పనులు జరుగుతున్నాయా అనే అంశంపై స్పష్టత లేదని వారు పేర్కొంటున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, నిర్మాణం జీహెచ్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందా లేదా అనే విషయంలో సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే నిర్మాణ స్థలాన్ని తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు భవన అనుమతులు, ఆమోదిత నిర్మాణ ప్రణాళిక, సెట్బ్యాక్‌లు, అంతస్తుల పరిమితి తదితర అంశాలను పరిశీలించి, ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ మెకానిక్స్ దినోత్సవం



**ఎల్బీనగర్, జూన్ 3,వన్ నేషన్ :** ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం టూ వీలర్ మెకానిక్స్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో హయత్ నగర్ వనస్థలిపురం హస్తినాపురం బి.యన్.రెడ్డి నగర్ టూ వీలర్స్ మెకానిక్స్ పాల్గొని రక్తదానం చేశారు. మిత్ర బ్లడ్ బ్యాంక్ వైద్య బృందంచే రక్తదానం సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల్ రవి వనస్థలిపురం ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని వారు తెలిపారు.సుమారు 50 మంది పైగా పాల్గొని రక్తదానం చేశారు. టూ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి పేర్కొన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మోయిన్, కోశాధికారి నరేందర్ రెడ్డి,ఆర్గనైజర్ నరసింహ యాదవ్, అడ్వైజర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సీమకు నవ శకం

(1వ పేజీ తరువాయి)

సిద్ధమయ్యారు. 1.30 గంటలు అవుతున్నా ఒక్కరు కూడా ఇక్కడ నుంచి కదలలేదు. దీన్నిబట్టి రాయలసీమకు అన్నీ మంచి రోజులేనని తేలిపోతోంది" అని చంద్రబాబు అన్నారు. "స్టీల్ ప్లాంట్‌కు జగన్ ఆనాడు మోసపూరిత శంకుస్థాపనలు చేశారు. 2019 డిసెంబరులో, 2023లో రెండుసార్లు భూమి పూజ చేశారు. కానీ, ఒక తట్ట మట్టి పోయలేదు. ఒకచిన్న బిల్డింగ్ కూడా కట్టలేదు. అన్ని అడ్డంకులూ తొలగించుకొని వచ్చాం. ప్లాంట్ నిర్మాణానికి 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు దశల్లో రూ.4,500కోట్లు, రూ.11,850కోట్లు...సోలార్ ఎనర్జీకి రూ.20,350కోట్లు...మొత్తం కలిసి రూ.36,700కోట్లు ఖర్చు చేయబోతున్నాం.

# తక్కువ మాటలు.. ఎక్కువ పని



ప్రస్తుతం అగ్రకథానాయిక సమంత డబుల్ హ్యాపీనెస్‌లో ఉన్న విషయం తెలిసిందే. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' విజయం సాధించడంతో అభిమానులు వరుస పోస్ట్‌లు పెడుతున్నారు. వారందరికీ సమంత రిప్లై ఇస్తున్నారు. తాజాగా ఓ అభిమాని పోస్ట్‌ను ఇన్‌స్టాలో షేర్ చేసిన ఆమె ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'డియర్ స్వర్ణ (సినిమాలో సమంత పాత్ర పేరు).. ఇంట్లో ఆడపిల్లలు ఎప్పుడూ మహాలక్ష్మిలా ఉండాల్సిన అవసరం లేదు.. ఒక్కోసారి కాళీమాతలాగా కూడా మారాలని నువ్వు నిరూపించావు..' అని సదరు నెటిజన్ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ఈ పోస్ట్‌ను షేర్ చేసిన సమంత.. 'తక్కువ మాట్లాడాలి. ఎక్కువ పనిచేయాలి. మన పనే మన విజయాన్ని చూపిస్తుంది. మీ అందరి అభిమానానికి కృతజ్ఞతలు. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది' అని రాసుకొచ్చారు. కాగా.. విడుదలకు ముందు నుంచే టికెట్ల బుకింగ్స్‌లో హవా చూపిన ఈ చిత్రం.. విడుదల అనంతరం మౌత్ టాక్‌తో మంచి వసూళ్లను ఖాతాలో వేసుకుంటోంది. పది రోజుల్లో రూ.73కోట్లు సాధించింది. నార్త్ అమెరికాలో రెండు మిలియన్ల క్లబ్‌లో చేరింది. దీంతో త్వరలోనే ఈ సినిమా రూ.100కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు విశ్వాసంగా ఉన్నారు.

# అదిరిపోయే రేంజ్‌లో ఆరంభం

దేశవ్యాప్తంగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక పానిండియా చిత్రాల్లో ఎన్టీఆర్ 'డ్రాగన్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇండియా లెవల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ 50శాతం పూర్తయింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఎంట్రీ సీక్వెన్స్ కోసం భారీ సెట్ల నిర్మాణం జరుగుతున్నదని సమాచారం. ఈ సీక్వెన్స్‌లో తారక్ గెటప్ కొత్తగా ఉంటుందట.ఎన్టీఆర్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఈ లుక్‌ని ప్రశాంత్‌నీల్ డిజైన్ చేశారట. ఈ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్‌తో పాటు నలభైమంది ఫైటర్స్ కూడా భాగం కానున్నారట. ఈ సీక్వెన్స్‌తో షెడ్యూల్ పూర్తవుతుందని. ఓ పాట షూట్‌తో నెక్స్ట్ షెడ్యూల్ మొదలవుతుందని ఇన్‌సైడ్ టాక్. సాధారణంగా ప్రశాంత్‌నీల్ సినిమా ఫ్రేమ్స్ అన్నీ బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉంటాయి. కానీ ఈ సినిమాను మాత్రం ఆయన కలర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారట. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.





# 'నో' చెప్పడం నేర్చుకోండి

'ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.



# ఔను.. ఆ కథల వైపే నా అడుగులు!

కెరీర్‌లో నేను చేయాలనుకునే పాత్రలకు సంబంధించిన అవకాశాలు రాకపోయినా ఫర్వాలేదు.. నా ప్రపంచంలో నేను సంతోషంగా ఉన్నానంటోంది బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా. 'దహాద్'లో పోలీసు అధికారిణి, 'హీరామండి'లో వేశ్య నుంచి ఇటీవల విడుదలైన 'సిస్టమ్' చిత్రంలో న్యాయవాది లాంటి శక్తిమంతమైన నాయికా ప్రాధాన్య పాత్రల్లో ప్రేక్షకుల్ని అలరిస్తున్న కథానాయికీమె. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఇటీవల కథల ఎంపికలో బలమైన మహిళా పాత్రలనే ఎంచుకోవడంపై అభిప్రాయాల్ని పంచుకుంది. "వందశాతం నేను ఎంచుకుంటున్న ప్రాజెక్ట్‌లతో బలమైన మహిళా ప్రాధాన్య కథల వైపే నడుస్తున్నాను. ఒక నటిగా ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చేదే నాకు ముఖ్యం. 'సిస్టమ్' సినిమా ప్రచారంలో దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీ నన్ను హాలీవుడ్ దిగ్గజ నటీమణులతో పోల్చారు. వారిలా ఉండాలని నేను ప్రయత్నించకపోయినప్పటికీ.. ఎంతగానో ఆరాధించే, అభిమానించే దిగ్గజాలతో పోల్చడం మంచి అనుభూతినిచ్చింద"ని చెప్పుకొచ్చింది సోనాక్షి.

# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'జయ జానకి నాయక'



టాలీవుడ్‌లో ఏ హీరోకు లేని అరుదైన రికార్డును బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సొంతం చేసుకున్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'జయ జానకి నాయక' సరికొత్త రికార్డు సాధించింది. 100 కోట్ల వ్యూస్‌ను దక్కించుకుంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ సినిమా 2017లో విడుదలైంది. జయ జానకి నాయక' చిత్రాన్ని హిందీలో 'ఖూన్‌ఖార్' పేరుతో డబ్బింగ్ చేసి యూట్యూబ్‌లో విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్‌ను సాధించింది. యూట్యూబ్‌లో 1 బిలియన్ వ్యూస్ సాధించిన ఏకైక తెలుగు హీరో సినిమాగా నిలిచింది. ఇటీవల ఈ సినిమాలోని ఓ ఎమోషనల్ డైలాగ్ సీక్వెన్స్ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌స్‌లో విపరీతంగా వైరల్ కావడంతో ఈ చిత్రం మళ్లీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. దీంతో యూట్యూబ్‌లో విడుదలై ఏడేళ్లు అవుతున్నా ఇంకా వీక్షణలు వస్తున్నాయి.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ,** RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**